క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



కేటీదొడ్డి: క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని బీజేపీ బూత్ అధ్యక్షుడు కృష్ణకాంత్ అన్నారు. గురువారం మండలంలోని పాగుంట గ్రామంలో యువతకు క్రికెట్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ యువత క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పారుంద్, వీరేష్, ఈరన్నగౌడు, మల్లేష్ పాల్గొన్నారు.

నేడు ఆదిశిలా క్షేత్రంలో హుండీ లెక్కింపు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలో స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ప్రహ్లాదరావు తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం



అయిజ: మున్సిపాలిటీలోని వివిధ కాలనీల్లో గురువారం అధికారులు, సిబ్బందితో కలిసి మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న పర్యటించారు. ఈ సందర్భంగా మడ్డిగుంత, చాకలిపేట, వల్లూరు పేట, నడిమి మసీద్ కాలనీల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు వారి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగన్న, వాటర్ లైన్‌మేన్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ డాక్టర్ లేక అవస్థలు

మల్దకల్: మండలంలోని పాల్వాయిలో ఉన్న పశువైద్య కేంద్రానికి డాక్టర్‌ను నియమించకపోవడంతో పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు అవస్థలు పడుతున్నారు. జీవాలు అనారోగ్యానికి గురైతే సకాలంలో వైద్యం అందని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. మరోవైపు రూ. 40లక్షల వ్యయంతో నిర్మించిన భవనం నిరుపయోగంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాల్వాయి పశువైద్య కేంద్రానికి డాక్టర్‌ను నియమించాలని కోరుతున్నారు.

జీవిత బీమాతో కుటుంబానికి ధీమా



ఆత్మకూర్: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ఎల్ఐసీ జీవిత బీమా సంస్థను ప్రతి ఒక్కరూ ఆదరించాలని చీఫ్ మేనేజర్ సురేష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో బీమా ఏజెంట్లతో సమావేశమై.. ఈ నెల 20న ఎల్ఐసీ 70 వసంతాల సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 14 లక్షల మంది ఏజెంట్లతో రూ.40 కోట్ల బీమా పాలసీలు, లక్ష మంది ఉద్యోగులున్న ఏకైక సంస్థ ఎల్ఐసీ అని ప్రైవేటు సంస్థలను నమ్మి మోసపోకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాజేశ్వర్, కరుణాకర్, సుబ్రమణ్యం, విరేశలింగం, రఘు, శివకుమార్, గోపాల్‌శెట్టి, రఘునాథ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, ఖాజమైనోద్దీన్, శివరాజు, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

పశుపోషకులకు తోడ్పాటు

- ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో కొట్టాల నిర్మాణం
- జాబ్‌కార్డు దారులు, మహిళా సంఘాల సభ్యులకు అవకాశం
- ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం
- క్షేత్రస్థాయిలో అధికారుల అవగాహన



మద్దూరులో పశువుల కొట్టానికి కొలతలు వేస్తున్న సిబ్బంది (ఫైల్)

మానవపాడు: పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకందారులకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ పొలాల్లో పశువుల కొట్టాలతో పాటు మేకలు, గొర్రెల షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అదే విధంగా పశువులు, జీవాల పోషణకు పచ్చగడ్డి పెంపకం, నీటితొట్ల నిర్మాణాలకు ఆర్థికంగా చేయూత అందించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్న వారితో పాటు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులను అర్హులుగా గుర్తిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు గొల్ల కురుమలకు ప్రాధాన్యం ఇచ్చేలా కార్యాచరణ రూపొందించారు.

యూనిట్ విలువ ఇలా..

పశువుల కొట్టాల నిర్మాణానికి రూ. 85వేల చొప్పున మంజూరు చేస్తున్నారు. మేకలు, గొర్రెల సంఖ్య ఆధారంగా షెడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించనున్నారు. అదే విధంగా మహిళాశక్తి ఉపాధి భరోసా, పొలంబాట, వన మహోత్సవం, జలనిధి, జలసంచాయ్, జలభగీరథ, రూరల్ శానిటేషన్ కింద వివిధ యూనిట్లను నిధులను మంజూరు చేసేలా కార్యాచరణ రూపొందించారు. వేసవిలో జీవాల దాహం తీర్చేందుకు గాను నీటితొట్ల నిర్మాణానికి నిధులు కేటాయించనున్నారు. జీవాల సంఖ్య ఆధారంగా నీటితొట్ల నిర్మాణానికి రూ. 15వేల నుంచి రూ. 20వేల వరకు మంజూరు చేసేలా ప్రణాళిక రూపొందించారు.

దరఖాస్తు విధానం..

పశువుల కొట్టాలు, గొర్రెలు, మేకల షెడ్ల నిర్మాణానికి ముందుగా సంబంధిత గ్రామపంచాయతీ తీర్మానం అవసరం. జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, సంబంధిత పశుసంవర్ధకశాఖ అధికారి నుంచి జీవాలు ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. పెంపకందారుడికి వ్యవసాయ భూమి ఉన్నట్లుగా తహసీల్దార్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని పొంది మండల పరిషత్ కార్యాలయ అధికారికి దరఖాస్తు అందించాలి. పరిశీలన అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ నుంచి జీవాల సంఖ్య ఆధారంగా యూనిట్ కేటాయించి నిధులను మంజూరు చేస్తారు. మానవపాడు మండలంలో పశువుల కొట్టాల నిర్మాణానికి 105 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 29 నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. టైప్–2కు సంబంధించి ఇంత వరకు ఒకటి కూడా నిర్మించుకోలేదు.

అవగాహన అవసరం..

గ్రామాల్లో పశువుల కొట్టాల కోసం ఉన్న అవకాశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి. అర్హులైన వారు నిర్మాణాలు చేసుకునేలా ప్రోత్సాహం అందించాలి. అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఉన్న బిల్లులను త్వరగా అందే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి..

పశువులు, గొర్రెలు, మేకల పెంపకందారులు కొట్టాలు, షెడ్ల నిర్మాణాలను సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధి హామీ జాబ్‌కార్డు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు పథకం వర్తిస్తుంది. వందశాతం సబ్సిడీతో షెడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుంది. – విజయ్‌కుమార్, ఏపీఓ

క్షేత్రస్థాయిలో అవగాహన..

మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పశువుల కొట్టాలు, గొర్రెలు, మేకల షెడ్ల మంజూరులో గొల్ల కురుమలతో పాటు ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. గ్రామస్థాయిలో దరఖాస్తు చేసుకుంటే అధికారులు మంజూరు చేస్తారు. ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి. – భాస్కర్, ఎంపీడీఓ

ఉత్సాహంగా ఎడ్లబండ్ల గిరక పోటీలు



అరగిద్దలో ఎడ్లబండ్ల గిరక పోటీలను ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీధర్‌గౌడు

గట్టు: మండలంలోని అరగిద్ద గ్రామంలో వీరాంజనేయస్వామి జాతరను పురస్కరించుకొని గురువారం జిల్లాస్థాయి ఎడ్లబండ్ల గిరక పోటీలు నిర్వహించారు. గద్వాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీధర్‌గౌడు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్ పోటీలను ప్రారంభించగా.. వివిధ ప్రాంతాలకు చెందిన తొమ్మిది జతల ఎడ్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీరాంజనేయస్వామి జాతర సందర్భంగా స్నేహపూర్వక వాతావరణంలో ఎడ్లబండ్ల గిరిక పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అందరూ కలిసిమెలసి ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గోవర్దన్‌గౌడు, రఘుగౌడు, రాజుగౌడు, మోహన్, బజారి, గాజుల సంతోష్, రాజప్ప, నవీన్ ఆచారి, పురుషోత్తంరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజారెడ్డి, నర్సింహులుగౌడు, బడెన్న, హనుమంతు, రంగస్వామి పాల్గొన్నారు.

పెంచికలపాడులో ట్రాక్టర్ రివర్స్ పోటీలు..



పెంచికలపాడులో..

మండలంలోని పెంచికలపాడులో చౌడేశ్వరిదేవి జాతరను పురస్కరించుకొని గురువారం గ్రామస్థాయి ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించారు. గ్రామ నాయకులు జంగం హన్మంతు, గోకారి, మల్లికార్జున్ పోటీలను ప్రారంభించగా.. పలువురు ట్రాక్టర్ల డ్రైవర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున జనం తరలివచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాషా, వడ్ల వీరేష్, శివప్ప, రాఘవేంద్ర, బసప్ప, తిరుమలేష్, నర్సింహులు, గోపాల్, వెంకటేష్, ఆశప్ప, హంపన్న, వీరేష్ పాల్గొన్నారు.

మట్టిరోడ్డు ఏర్పాటు



మల్దకల్: మండలంలోని ఎల్కూరు గ్రామంలో ఓ కాలనీ ప్రజలు సొంత డబ్బులతో మట్టిరోడ్డు ఏర్పాటు చేసుకున్నారు. కొన్నేళ్లుగా కాలనీకి వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నా పట్టించుకోలేదు. దీంతో కాలనీ వాసులు తమ డబ్బు వెచ్చించి మట్టిరోడ్డు ఏర్పాటు చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

108లో ప్రసవం : తల్లీబిడ్డ క్షేమం



శిశువుతో 108 ఈఎంటీ శివశంకర్

అలంపూర్: పురిటి నొప్పులతో బాధ పడుతున్న గర్భిణిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలోనే ప్రసవించి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అంబులెన్స్ ఈఎంటీ శివశంకర్, పైలెట్ శ్రీశైలం వివరాల మేరకు.. అలంపూర్‌కు చెందిన గర్భిణి ఫాతిమాకు పురిటి నొప్పులు రావడంతో భర్త షేక్షావలి బుధవారం రాత్రి స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే ఆమెకు కాన్పు చేయడం సాధ్యపడదని, కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యసిబ్బంది సూచించారు. ఈ మేరకు గురువారం తెల్లవారుజామున గర్భిణిని కమ్యూనిటీ ఆస్పత్రి నుంచి కర్నూల్‌కు 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా.. పురిటి నొప్పులు అధికం కావడంతో ఇమాంపురం వద్ద అంబులెన్స్ రోడ్డుపక్కన ఆపి డెలివరీ చేసినట్లు ఈఎంటీ తెలిపారు. తల్లీబిడ్డను తిరిగి కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సంతోష్

శాంతినగర్: ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్ఐ సంతోష్ అన్నారు. వడ్డేపల్లి మండలం రామాపురంలో గురువారం పోలీసు కళా బృందంచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, జోగిని వ్యవస్థ, రోడ్డు ప్రమాదాలు, డయల్ 100 ప్రాముఖ్యత, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. మహిళలు, బాలికలను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బాధిత మహిళలు భరోసా కేంద్రం సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. యువత డ్రగ్స్, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కర్

మానవపాడు: ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు గ్రామసభలు నిర్వహించి, అర్హుల గుర్తింపు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

సాగుయోగ్యం కాని భూముల గుర్తింపునకు శ్రీకారం



అయిజలో డెస్క్ వర్క్ నిర్వహిస్తున్న తహసీల్దార్ జ్యోతి



గట్టులో వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ సరితారాణి

అయిజ/గట్టు: రైతుభరోసా పథకం అమలులో భాగంగా సాగుయోగ్యం కాని భూములను క్షేత్రస్థాయిలో గుర్తించే ప్రక్రియకు రెవెన్యూ, వ్యవసాయ అధికారులు గురువారం శ్రీకారం చుట్టారు. అయిజ మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతి, ఏఓ జనార్దన్, అధికారులు, సిబ్బంది డెస్క్ వర్క్ నిర్వహించారు. లేఅవుట్లు, నాలా కన్వర్షన్లు, రోడ్లుగా మారిన భూములు, పరిశ్రమలు, గోదాములు, మైనింగ్‌కు వినియోగిస్తున్న భూములతో పాటు రాళ్ల రప్పలు, గుట్టలతో నిండి వ్యవసాయానికి పనికిరాని భూములను గుర్తింపు ప్రక్రియ చేపట్టారు. డెస్క్ వర్క్ అనంతరం ఫీల్డ్ వర్క్ చేయనున్నట్లు తహసీల్దార్ జ్యోతి తెలిపారు.

■ గట్టు మండల రెవెన్యూ కార్యాలయంలో వ్యవసాయాధికారులతో తహసీల్దార్ సరితారాణి సమావేశమయ్యారు. గ్రామాల వారీగా సాగుయోగ్యం కాని భూములను గుర్తించే పనిలో నిమగ్నయ్యారు. ఏఓ హనుమంతురెడ్డి, ఆర్ఐ రాజు ఉన్నారు.

గ్రామాల వారీగా అర్హుల జాబితా రూపొందించాలి



పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ చెన్నయ్య

గట్టు: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హుల జాబితాను గ్రామాల వారీగా రూపొందించాలని ఎంపీడీఓ చెన్నయ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులను గుర్తించాలని సూచించారు. ఎలాంటి భూములు లేని, ఉపాధి హామీ పథకం ద్వారా కనీసం 20 రోజులు పనులు చేసిన వారిని అర్హులుగా గుర్తిస్తూ.. గ్రామాల వారీగా జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులతో పాటు, సర్వే వివరాలను పరిశీలించాలని తెలిపారు. అర్హుల జాబితాను తయారు చేసి, గ్రామసభలో తీర్మానం చేయాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా కొత్త రేషన్‌కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులను గుర్తించాలని తెలిపారు. సమావేశంలో ఎంపీఓ రవి తదితరులు ఉన్నారు.

తిక్క వీరేశ్వరస్వామి జాతరకు ఏర్పాట్లు



ఆలయ ప్రాంగణంలో సమావేశమైన కమిటీ సభ్యులు

అయిజ: మండల కేంద్రంలో ఫిబ్రవరి 15 నుంచి నిర్వహించనున్న తిక్క వీరేశ్వర స్వామి జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో సమావేశమై జాతర ఏర్పాట్లపై చర్చించారు. ఆలయ ఆదాయానికి సంబంధించి 2024 సంవత్సరంలో రూ. 1,45,904 మిగులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది స్వామివారి జాతరను వైభవంగా నిర్వహించాలని తీర్మానించారు. అందుకు సంబంధించిన ప్రణాళికను త్వరలో రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, ఆలయ పూజారి లక్ష్మీరెడ్డి, కమిటీ సభ్యులు విష్ణువర్దన్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, మహానందిరెడ్డి, మధుకుమార్, లక్ష్మన్న, అశోక్, భగత్‌రెడ్డి ఉన్నారు.

గంద్రకోట కుమారస్వామి ఆరాధనోత్సవాలు



గంద్రకోట కుమారస్వామి శాస్త్రికి పూజలు చేస్తున్న వంశీయులు

అలంపూర్: జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి క్షేత్రంలో గురువారం గంద్రకోట కుమారస్వామి శాస్త్రి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ పురేందర్ కుమార్, గంద్రకోట కుమారస్వామి శాస్త్రి వంశీయులు ఆలయ ధర్మకర్తలతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. గంద్రకోట కుమారస్వామి శాస్త్రి జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ నిత్యాన్నదాన సత్రం వ్యవస్థాపకులు. అలంపూర్ క్షేత్ర ఉద్ధారకులుగా ఉంటూ.. 1892లో శ్రీ బ్రహ్మేశ దాన సంస్థానాన్ని స్థాపించారు. దాదాపు 262 ఎకరాలను దాతల సహకారంతో సేకరించి.. అన్నదాన సత్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది ఆయన ఆరాధనోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో ధర్మకర్తలు నాగశిరోమణి, సరస్వతి, జగదీష్ గౌడ్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీహయగ్రీవస్వామి ఉత్సవాలు



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

ఎర్రవల్లి: బీచుపల్లి క్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో లక్ష్మీహయగ్రీవస్వామి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో మొదటి రోజు అర్చకులు భగవదనుజ్ఞా, విష్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవచనం, రక్షాబంధనం, ఆచార్య రుత్విక్వరణం, మృత్సంగ్రహణం, యాగశాల ప్రవేశం, అంకురార్పరణ, అగ్నిప్రతిష్ఠ, అంకురార్పరణ గహవనం, తీర్థప్రసాద గోష్ఠి వంటి పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

అలంపూర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిర్వహించే పోరాటాల రూపకల్పనలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కమిటీ సభ్యుడు రాజు పిలుపునిచ్చారు. అలంపూర్‌లో సీపీఎం రాష్ట్ర మహాసభల నిర్వహణకు గురువారం ఆ పార్టీ నాయకులు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతతత్వ విధానాలతో ప్రజల మధ్య విద్వేషాలను పెంచి పోషిస్తుందన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సంగారెడ్డిలో 25 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సభకు ముఖ్య అతిథులుగా సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, బీవీ రాఘవులు హాజరై భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తారన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ అధ్యక్షుడు వెంకటస్వామి, నర్సింహ, నాగరాజు, అయ్యప్ప, చిన్న రాయుడు, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు



ధరూరులో మాట్లాడుతున్న అధికారులు

ధరూరు: ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా గురువారం మండలంలోని దోర్నాల, ధరూరు, సోంపురం, మన్నాపురం, పారుచర్ల గ్రామాల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ విజయ్, బాలల సంరక్షణ అధికారులు పద్మ, నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. ఎవరైనా బడిఈడు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా గ్రామాల్లో బడి మానేసిన పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని.. పిల్లలను పనులకు కాకుండా బడికి పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. పేదల ఆర్థిక పరిస్థితిని ఆసరాగా చేసుకొని ఎవరైనా బాలలను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారి మోహిన్‌పాషా, కానిస్టేబుల్ రాజు, నరేష్, ముంజుల, ధనలక్ష్మి, సీఆర్‌పీలు నర్సింహులు, బతుకన్న తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన బ్రిడ్జి నిర్మాణం



భైరాపురంలో అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణం

ఉండవెల్లి: మండలంలోని భైరాపురం నుంచి కర్నూల్ వెళ్లే మార్గంలో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతోంది. రెండేళ్ల క్రితం ప్రారంభమైన పనులను పూర్తి చేయించడంపై సంబంధిత అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ రహదారిపై నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. భైరాపురం గ్రామంలో బ్రిడ్జి నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ. 1.50 కోట్లు మంజూరు చేసింది. రెండేళ్ల క్రితం పనులను ప్రారంభించారు. అయితే సంబంధిత అధికారుల నిర్లక్ష్యం, గుత్తేదారు అలసత్వం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.